# న్యాయమెక్కడుంది?

సత్యం పార్కరు పెన్ను పోయింది. దాన్ని ఆఫీసులోనే విడిచిపెట్టాడో, లేక ఎవరికైనా యిచ్చి తీసుకోటం మర్చిపోయాడో, అతనికి జ్ఞాపకంలేదు. ఆరోజు పోస్టాఫీసుకి వెళ్ళినపుడు అక్కడొకాయన పెన్ను అడిగాడు. సత్యం ఇవ్వనన లేక ఇచ్చాడు. ఆ వ్యక్తి పెన్ను తిరిగి ఇచ్చిందీ, లేనిదీ ఇప్పుడు అనుమానంగా తోచింది. ఇల్లాంటి సంఘటనలు ఎన్నో జరగటం, ఎన్నోసార్లు విన్నాడతను. పెన్ను ఇచ్చిన వాళ్లు అంత తెలివితక్కువగా, అడక్కుండా ఎలా మర్చిపోతారా, అని వాళ్లను విమర్శిస్తూ తెగతిట్టేవాడు సత్యం. ఇప్పుడు తనూ వాళ్ల జాబితాలోకే చేరిపోవటం సిగ్గుచేటుగా వుందతనికి.

సత్యం, ఆఫీసులో తన పక్కసీటలో కూర్చునే ఇద్దరు ముగ్గురు స్నేహితుల ఇళ్ళకు పోయి పెన్నువిషయం అడిగాడు. వాళ్ళు తమకా విషయమేమీ తెలీదంటూ పెన్ను పోయినందుకు సానుభూతి చూపిస్తూ, అంతటితో చాలించక 'ఇంత మతిమరుపు యేమిటోయ్!' అన్నారు. సత్యం వళ్ళు మంచుముక్కలా చల్లబడింది. ఒకరి చేత విమర్శింపబడటమంటే, అతనికి పరమ అసహ్యం... బాధ కూడాను. కాని, అతని ఇష్టాయిష్టాలతో ఎవరికేంపని?

ఆరోజు రాత్రి సత్యానికి సరిగ్గా అన్నం నోటికి పోలేదు. కంటినిండా నిద్రపటలేదు. ఇంట్లో ఎవరితోనూ సమంగా మనసిచ్చి మాట్లాడ్డంలేదు. ఎవరైనా యేం యిలా వున్నావని అడిగితే కసుక్కుండేవాడు నిజం చెప్పడానికి ఇష్టంలేక. కాదూ మరి— పార్కరు పెన్ను, అంత ఖరీదుపోసి కొన్న పెన్ను, కేవలం మతిమరుపుమూలంగా పోయిందంటే ఎంత బాధగా వుంటుంది? మళ్ళీ తను అంత ఖరీదు పెట్టి అటువంటి పెన్ను కొనుక్కోగలడా? ఉహూ! ఈ జన్మలో ఈ గుమస్తా నౌకరీ చేస్తున్నంతవరకూ కొనలేడు....ఆ రాత్రంతా ఇలానే తలపోశాడు.

మరుసటిరోజు ఆఫీసుకి వెళ్ళాడే గాని, సత్యం మొహంలో మునుపటి కళాకాంతులు లేవు. నిర్జీవంగా తన సీటులో కూర్చున్నాడు. అతని కళ్ళకి ఎదురుగా టేబిలు శుభ్రపరుస్తూన్న బంట్రోతు నారాయణ అగుపించేసరికి ఎందుకైనా మంచిది వాణ్ణి అడగాలనిపించింది. "ఒరేయ్ నారాయణా!" అంటూ మెల్లగా కేక వేశాడు.

నారాయణ అంతవరకూ సత్యాన్ని చూళ్ళేదు కదూ, అతని గొంతువిని ఒక్కసారి వనక్కి తిరిగాడు.

"నమస్కారం బాబుగారూ! ఎప్పుడొచ్చారు! నేను చూడలేదు" అంటూ

## ముద్దంశెట్టి

ఇంకా యేమో అనాలనుకునేసరికి సత్యం అందుకుని,

"ఇప్పుడే వచ్చానుగాని...నిన్నను నా పెన్నుగాని ఇక్కడ వదిలిపెట్టానేవిట్రా?" అన్నాడు విచారంగా.


"ఆ యిసయమే నేనూ సెప్పాలనుకుంటున్నా బాబుగారూ! మీరు యెల్లిపోయింతర్వాత మీ టేబిలుమీద పెన్ను చూశా. పిలుద్దామన్నా, కానాదూరం పోయుంటారని వూసుకున్నా...ఇదిగోండి" అంటూ జేబునుండి పదిలంగా దాచిన పార్కరు పెన్ను తీసియిచ్చాడు నారాయణ.

లాటరీలో, పదివేలు రూపాయిలు ప్రైజు వచ్చినట్టుగా సంబరపడిన సత్యం మొహం విప్పారిన పుష్పంలా ఇంతయ్యింది. ఆప్యాయంగా, ఆత్రుతగా పెన్ను చేతిలోకి తీసుకున్నాడు. తృప్తిగా ఓమారు పెన్ను చూసుకుని 'హమ్మయ్య' అనుకున్నాడు మనసులో. పక్కసీట్లలో కూర్చున్న స్నేహితులకు చెప్పాడు పెన్ను దొరికిన వైనం.

"ఇంకెప్పుడూ ఇలా విడిచిపెటకోయ్. ఈరోజు నారాయణకి దొరికిందిగాబట్టి నీకు తిరిగివచ్చింది. అదృష్టవంతుడివే ... మరోరోజ మన గుమస్తాలలో కొందరికి దొరికితే తిరిగి వస్తుందన్న నమ్మకముండదు.." అన్నాడొకాయన. సత్యం చిన్నగా నవ్వేశాడు.

పదినిముషాలు గడిచాయి. నారాయణ ఏవో పనులు చూసుకొని వచ్చి సత్యం టేబిలుముందు నుంచున్నాడు చేతులు నులుపుకొంటూ.

"ఏంరా నారాయణా! ఏం కావాలి?" అన్నాడు సత్యం ఆప్యాయత వుట్టిపడేలా,

# ★ న్యాయమెక్కడుంది? ★

ఇంతకుముం దెప్పుడూ అంత ఆప్యాయంగా అడిగిన పాపాన పోలేదతను. పెన్ను పోకుండా దాచిపెట్టాడు కదా అన్న కృతజ్ఞతగా మోసు ఆరోజు అడగటంలో అంతరార్థం!

"బాబూ! ఓ రెండురూపాయిలుంటే ఇవ్వండి. ఇంట్లో బియ్యపుగింజలు లేవు. మరి మూడురోజులు గడిస్తే కాని జీతాలు దొరకవు. మీకు తెలీందేముంది?" అన్నాడు నారాయణ మెల్లగా రహస్యం చెప్తున్నట్టు.

ఆ క్షణంవరకూ నారాయణపై వుంచే సదభిప్రాయం మంచు ముక్కలా కరిగి పోయింది సత్యం హృదయంలో. పెన్ను పోయిన వైనమంతా ఓ చిత్రంలా అగుపించింది అతనికళ్ళకి. ఆలోచనలో పడ్డాడు... నారాయణకి రెండురూపాయలు అవసరం. ఆ అవసరం నిన్ననే వుండివుండాలి. కాని, ఎవర్నీ అడగలేదు. తను ఆఫీసు ఆవరణ దాటకముందే వీడు పెన్ను టేబిలుమీద చూసివుంటాడు. వెంటనే తెచ్చియిచ్చేస్తే అయివుండేది. కాని, వాడి డబ్బు అవసరం అలా చేయనిచ్చిందికాదు. తను వాడికి పూరికనే డబ్బు ఇచ్చేయకపోయినా, మామూలుగా అడిగిందానికీ, ఏదో సహాయం చేశాక అడిగిందానికీ చాల వ్యత్యాసముంటుందని వాడనుకున్నాడు. సహాయం చేశాక అడిగితే విలువ ఎక్కువ ఉంటుంది. అందుకే పెన్ను యింటికి తీసుకుపోయి, ఈ వేళ తెచ్చియిచ్చాడు. ఎందుకు? పెన్ను ఇచ్చేసిన కాస్సేపటికి రెండు రూపాయలు అడగాలనుకున్నాడు. వెంటనే తను యిస్తానని వాడికి తెలుసు. ఇదీ వాడి నాటకం! ఛీ! ఛీ!! యెంత చిన్నబుద్ధి? ఏం, నిన్ననే పెన్ను యిచ్చేస్తే, తనకి రాత్రంతా అంత గాభరాపడనవసరం వుండేదికాదే! హాయిగా నిద్రపట్టేదే! అందరితోనూ మామూలుగానే నవ్వుతూ మాట్లాడేవాడే! వీడివల్లనే కదా, యీ చికాకులన్నీ యేర్పడ్డాయి!...... యిలా వూహించిన సత్యం, ఆ విషయాన్ని నారాయణని అడిగేయాలనుకున్నాడు... అడగటమేమిటి నాలుగుచీవాట్లు పెట్టాలనుకున్నాడు. నాలుక కొసవరకూ వచ్చాయి మాటలు. కాని, యెందుకో యే అజ్ఞాతశక్తి నిరోధంవల్లనో మానేశాడు. జేబునుండి రెండు రూపాయిలు తీసి అయిష్టంగా నారాయణ చేతిలో పెట్టాడు.

నారాయణ యెంత తృప్తిపడ్డాడో, వాడి మొహమే చెప్తోంది. సత్యాన్ని మనస్సులో మాత్రం మెచ్చుకుని దీవించి వుంటాడు. వాడికా కృతజ్ఞత వుంది.

సత్యం మాత్రం తన అభిప్రాయాన్ని మనసులో దాచుకోలేక పోయాడు. నారాయణ అక్కణ్ణించి వెళ్ళిపోయాక, పక్కనే వున్న జగన్నాథంతో అనేశాడు. జగన్నాథం వటకారంగా నవ్వేడు. "నువ్వు చాలా తొందరపడి తప్పుగా వూహించేస్తూ వుంటావోయ్ సత్యం: అది ఒకొక్కప్పుడు ప్రమాదం కూడాను. అది చాలతప్పు. నారాయణ నువ్వనుకున్నంత నీచపుమనిషి కాడు. ఆ విషయం మనకు చాలకాలంనుండి తెలుసు. వాడికి డబ్బు అవసరమన్న విషయం నిజమే! అందుకోసమని నీ పెన్ను వాడు చూసేసరికి నువ్వు ఆఫీసు ఆవరణలో వుంటున్నా సరే యివ్వక యింటికి తీసుకుపోయి, యివాళ తెచ్చి, నీ మెప్పును పొంది, ఆ రెండు రూపాయిలు అడగాలనుకున్నాడని నువ్వనుకోటం చాల పొరపాటు. వాడి అంతస్తు యెంత తక్కువైనదో, హృదయం అంత వున్నతమైనది. అందుకే నీ పెన్ను భద్రంగా తెచ్చి నీకిచ్చాడు. అమ్మకోడానికి ప్రయత్నిస్తే, రెండు రూపాయిలేవిటి— పదిహేను రూపాయిలయినా వస్తాయి. ఒక వేళ వాడు నీ మెప్పే పొందాలంటే, నిన్న సాయంత్రం ఆ పెన్ను నీకు తెచ్చిస్తే నువ్వు వాణ్ణి మెచ్చుకోవా? అందుకే, వ్యక్తుల విలువలు అంతస్తుల్ని ఆధారంగా తీసుకొని కట్టకూడదు. ఇప్పటికైనా వాణ్ణి అర్థంచేసుకుందుకు ప్రయత్నించు... నాతో అన్నావు... యింక వాణ్ణే అడిగావుకాగు, కొంపదిసి... వాడెంత బాధపడేవాడో!" అన్నాడు జగన్నాథం.

సత్యం చిన్నబుచ్చుకున్నాడు. తను నారాయణని తప్పుగా అర్థంచేసుకున్నాడేమో ననుకున్నాడు.... నిజమే! వాడిపట్ల తనెంతో అన్యాయంగా యోచించాను... అనుకున్నాడు. ★

---

ఒక స్నేహితుడు డాక్టరు వద్దకు వెళ్ళాడు. డాక్టరు మందుచీటి వ్రాసినతర్వాత—

స్నేహితుడు: నీఋణం ఎట్లా తీర్చుకోవాలో తెలియటంలేదోయ్. అందుచేత ఏదో నాశక్తికొద్దీ వీలునామాలో నీకూ కూడా భాగం వ్రాశానులే.

డాక్టరు: అయితే, ఏదీ ఆ చీటి ఒక్కమారు ఇలా ఇయ్యి, మందు మార్చాలి.

కుమారి కొజవెంకటకమల, విజయవాడ.

---


## తరచుగా మూత్రం వెలువడుచున్నదా?

చక్కెరతోగాని లేక చక్కెర లేకుండాగాని తరచుగా మూత్రము వెలువడుట మిక్కిలిప్రమాదకరమైన చిహ్నము. శరీరాన్ని గుల్లచేయడమే కాకుండా యీ వ్యాధి, తనబంధంలో చిక్కిన వారిని ఆరోజుకారోజు మృత్యువుకు ఆసన్నుని చేయును. ప్రథమదశలో శారీరక మానసిక శ్రమలకు యిచ్చగించకుండుట, నడుములో నొప్పి, చూపు మాంద్యము, తొడల్లో తిమ్మిరి, నరముల బలహీనతతో యీ వ్యాధి పొడచూపును. పై లక్షణములతోకూడిన వ్యాధికి వెంటనే తగిన చికిత్స చేయించకున్నచో అధికదాహం, ఆకలి, గొంతు నోరు యెండుట, దురదలు, కాళ్ళలో పగుళ్ల తూకంతగ్గడం, శరీరమంతా పోట్లు, కీళ్ల నొప్పులు, కంటిపొరలు, క్షయ, గడ్డలు, రాచపుండ్లు, యిట్టి భయంకర బాధాకరమైన వ్యాధులు యెన్నో సంభవింపవచ్చును.

"వీనస్‌ఛారమ్" మాత్రలు వాడి, అనేక వేలమంది తమబాధల నుండినివారణపొంది మృత్యుకరాళమునుండి రక్షింపబడిరి, "వీనస్ ఛారమ్" శాస్త్రీయ పద్ధతులమీద, ప్రాచీన యూనానివైద్య విధానప్రకారం అమూల్య ఓషధుల, శాకపదార్థముల, స్వాభావిక క్షారముల సారముతో తయారైనవి. మూత్రములో పంచదార, పలుమారు మూత్రవిసర్జనచేయు అవసరము, 2 లేక 3 రోజులలోనే మీకు చాలాభాగము నివారణగును కొద్ది రోజులలోనే మీకు సగానికిపైగా స్వస్థత చేకూరినట్లనిపించును. "వీనస్ ఛారమ్" కొద్ది వ్యయముతో, సుఖముగా, తేలికగా సేవించవచ్చును. దీనికి ప్రత్యేకపథ్యము లేదు. నిరాహారముతో నుండే అవసరంలేదు రోగులు పుష్టికరమైన ఆహారము తినేందుకై రోగులు యిదివరకటికంటే యెక్కువరకాల ఆహారపదార్థములు తినికొనవచ్చును వివరములు గల ఇంగ్లీషు కరపత్రములు అడిగినచో ఉచితముగా పంపబడును ధర: 50 మాత్రల సీసా రు. 6-75 ప్యాకింగు పోస్టేజి ఉచితము.

లభించు స్థలము:

Venus Research Laboratory (A. P. W.)
P- O.Box No. 587, Calcutta.